
సాక్షి
ఖమ్మం
సోమవారం । 10 । మార్చి । 2025



.. ఆదరణ అంతంతే

తక్కువ ధరలకు లభించే జనరిక్ మందులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చినా వాటిపై ప్రజల్లో ఆదరణ మాత్రం నామమాత్రమే. 8లో



ఇఫ్తార్ (సోమవారం సా॥) 6.23

సహర్ (మంగళవారం ఉ॥) 5.04

రంజాన్ వేళలు

గరిష్టం / కనిష్టం 37° / 21°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. తెల్లవారు జామున, రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామదాసు మందిరాన్ని సందర్శించిన జిల్లా జడ్జి



ధ్యాన మందిరంలో జడ్జి రాజగోపాల్

నేలకొండపల్లి : నేలకొండపల్లిలోని భక్త రామదాసు ధ్యాన మందిరాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ ఆదివారం కుటుంబసమేతంగా సందర్శించారు. తొలుత మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామదాసు వాడిన బావిని పరిశీలించారు. ఆడిటోరియంలో రామదాసు చరిత్రకు సంబంధించిన చిత్రాపటాలను చూసి, ఆయన చరిత్ర గురించి అర్చకులు సౌమిత్రి రమేష్‌కుమారాచార్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీ ఉత్తరేశ్వరస్వామి, శ్రీ వైద్యనాథస్వామి ఆలయాలను సందర్శించారు. ఆ తర్వాత బౌద్ధక్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

సౌర విద్యుత్ సర్వే పూర్తి చేయాలి

మంత్రి భట్టి ఆదేశం



భట్టిని సత్కరిస్తున్న విద్యుత్ ఎస్ఈ శ్రీనివాసాచారి

ఖమ్మంవ్యవసాయం : జిల్లాలో నిర్దేశించిన సౌర విద్యుత్ గ్రామాల్లో సర్వే త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఖమ్మం ఎన్పీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఇనుగుర్తి శ్రీనివాసాచారి ఆదివారం హైదరాబాద్‌లో భట్టిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం భట్టి మాట్లాడుతూ.. నిర్ణయించిన గ్రామాల్లో సోలార్ సర్వే పూర్తి చేసి టెండర్లు పిలవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే మంజూరు చేసిన 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.

రామయ్యకు పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీగా తరలివచ్చారు. డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులో దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 338 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.11,410, 250 మంది బోటింగ్ చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.11,970 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అమ్ముదామా.. ఆగుదామా?!

ఆశించిన ధర రాకపోవడంతో మిర్చి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రతికూల పరిస్థితుల్లో సాగు చేసినా ఆశించిన దిగుబడి రాక.. వచ్చిన పంటకూ సరైన ధర దక్కక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ధర లేకపోవడంతో ఎక్కువ మంది నిల్వ చేయాలని భావిస్తున్నారు. మరోవైపు రైతుల నుంచి కొనుగోలు చేసిన వ్యాపారులు సైతం ఇదే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో ఏ కోల్డ్ స్టోరేజీ వద్ద చూసినా మిర్చి బస్తాలతో వచ్చిన వాహనాలు బారులుదీరి కనిపిస్తున్నాయి.

– ఖమ్మంవ్యవసాయం

మిర్చికి ఆశించిన ధర లేక సందిగ్ధంలో రైతులు

- నిల్వ చేయడానికే ఎక్కువ మంది మొగ్గు.. వ్యాపారులదీ అదే దారి
- విదేశీ ఆర్డర్లతో ధర పెరుగుతుందని ఆశలు
- నిండిపోతున్న కోల్డ్ స్టోరేజీలు



కోల్డ్ స్టోరేజీల వద్దకు మిర్చి తీసుకొచ్చిన వాహనాలు

ఏడాదిలో ఎంత తేడా..

గతేడాది సీజన్‌లో క్వింటా మిర్చికి రూ.20 వేల నుంచి రూ.23వేల వరకు ధర పలకగా.. ఈ ఏడాది అందుకు భిన్నమైన పరిస్థితులు చోటుచేసుకున్నాయి. గత సంవత్సరం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి 2024 అక్టోబర్‌లో రూ.19 వేలు, నవంబర్‌లో రూ.18వేల ధర పలకగా.. ఈ ఏడాది సాగు చేసిన మిర్చికి రూ.17వేల వరకు ధర పలికింది. అయితే ఆ తర్వాత ధర పతనం అవుతుండగా తొలి కోతలు కావడంతో మైలకాయకు ధర తక్కువ ఉండడం సహజమేనని భావించారు. కానీ రోజురోజుకూ ధర మరింత పతనం కాసాగింది. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికీ ధర పడిపోయింది. డిసెంబర్‌లో నిల్వ మిర్చి క్వింటా ధర రూ.16 వేలకు, కొత్త మిర్చి ధర రూ.15,500కు, జనవరిలో నిల్వ మిర్చి ధర రూ.14,500కు, కొత్త మిర్చి ధర రూ.15 వేలకు పడిపోయింది. ఇక ఫిబ్రవరిలో రెండో కోతగా నాణ్యమైన మిర్చి వచ్చినా ధరలో పురోగతి లేకపోవడంతో రైతులకు ఆవేదనే మిగిలింది. ఫిబ్రవరిలో గరిష్ఠంగా రూ.14వేలు, మోడల్ ధర రూ.13,500గా పలికింది.

అన్ సీజన్‌పై ఆశలు

ఈ ప్రాంతంలో పండించే 'తేజా' రకం మిర్చికి చైనా సహా పలు దేశాల్లో డిమాండ్ ఎక్కువగా ఉంది. దీంతో అక్కడి ఆర్డర్ల ఆధారంగా ఎగుమతిదారులు కొనుగోలు చేయడంతో గత ఏడాది మంచి ధర పలికింది. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి లేక ధరలో పురోగతి లేనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యాన అన్ సీజన్‌లో గతేడాది మాదిరిగానే రూ.20 వేలు – రూ.23 వేల ధర వస్తుందనే ఆశతో అటు రైతులకు తోడు ఇటు వ్యాపారులు సైతం మిర్చి పంటను నిల్వ చేస్తున్నారు.

కోల్డ్ స్టోరేజీల బాట..

మిర్చికి ప్రస్తుతం ఆశించిన ధర లేకపోగా.. ముమ్ముందు గిట్టుబాటు ధర వస్తుందనే ఆశతో రైతులు నిల్వకు ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాలో 2,17,360 మెట్రిక్ టన్నుల మిర్చి నిల్వచేసే సామర్థ్యం కలిగిన 48 కోల్డ్ స్టోరేజీలు ఉన్నాయి. ఫిబ్రవరి ఆరంభం నుంచే ధర ఆశాజనకంగా లేదని రైతులు పంట నిల్వ చేస్తుండగా, వ్యాపారులు భవిష్యత్‌పై అంచనాలతో నిల్వ పెడుతున్నారు. జిల్లాకు తోడు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల రైతులు కూడా ఖమ్మం బాట పడుతుండడంతో ఇక్కడ కోల్డ్ స్టోరేజీలన్నీ నిండిపోతున్నాయని తెలుస్తోంది.

పెట్టుబడులు కూడా రావని...



జనవరిలో 50 బస్తాల మిర్చి క్వింటాకు రూ.13,200 చొప్పున విక్రయించా. రెండో కోత పంటకు ధర పెరుగుతుందనుకున్నా ప్రయోజనం లేదు. ఇప్పుడు అమ్మితే పెట్టుబడి కూడా దక్కదని 42 బస్తాలు నిల్వ చేస్తున్నా.

– బానోత్ మట్టా, గోవింద్రాల, కామేపల్లి మండలం

జూన్ తర్వాత ఆలోచిస్తా...



ప్రస్తుత ధర పెట్టుబడులను పూడ్చే స్థితిలో లేదు. గత ఏడాది మిర్చి రూ. 20 వేలకు విక్రయిస్తే ఈసారి రూ.14 వేలే వచ్చింది. జూన్, జూలై తరువాత ధర పెరుగుతుందనే ఆశ ఉంది. అప్పటివరకు చూసి అమ్ముతా.

– చిరసవాద రాజు, ఎదుళ్లచెరువు, తిరుమలాయపాలెం మండలం

సెర్ప్‌లో మెప్మా విలీనం

- ఒకే గొడుగు కిందకు మహిళా సంఘాల నిర్వహణ
- మహిళల అభివృద్ధే లక్ష్యంగా కీలక నిర్ణయాలు



ఖమ్మంమయూరిసెంటర్: మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ లక్ష్యమంటూ రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల అమలులో స్థానం కల్పిస్తోంది. ఇందిరా మహిళా శక్తి మిషన్ కింద రూపొందించిన పాలసీ – 2025లో భాగంగా పలు నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ క్రమంలో గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు, మెప్మా ద్వారా పట్టణ ప్రాంత మహిళలకు బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు ఇప్పించి ఆర్టీసీకి అద్దె బస్సుల కొనుగోలు, క్యాంటీన్ల ఏర్పాటు వంటి అవకాశాలతో అధికారులు తోడ్పాటు అందిస్తున్నారు. అయితే, ఇటు డీఆర్‌డీఏ, అటు మెప్మా అమలు చేస్తున్న పథకాలు ఒకే విధంగా ఉండగా.. వాటి లక్ష్యాలు కూడా ఒకటే. ఈ లక్ష్యాలను పూర్తిస్థాయిలో చేరుకోవడం, పర్యవేక్షణ సులువు చేసేలా రెండు శాఖలను ఒకే గొడుకు కిందకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యాన జిల్లాలో డీఆర్‌డీఏ, మెప్మాను విలీనం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా పరిధిలోని మహిళా సంఘాలు, సభ్యుల వివరాలను సేకరించారు.

వివరాలు ఇలా...

	డీఆర్‌డీఏ	మెప్మా
సమాఖ్యలు	1,018	05
స్వయం సహాయక సంఘాలు	25,076	5,706
మొత్తం సభ్యులు	2,68,627	55,916

ఇంటిగ్రేటెడ్ గురుకులాలకు నిధులు

రూ.200 కోట్ల చొప్పున ఏడింటికి మంజూరు

ఇల్లెందు/ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్(వైఐఐఆర్‌ఎస్) భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 55 నియోజకవర్గాల్లో భవనాలకు రూ.11వేల కోట్లు మంజూరు చేస్తూ విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా పేరిట ఉత్తర్వులు వెలువడ్డాయి. ఒక్కో గురుకుల భవనానికి రూ.200 కోట్లు కేటాయించగా జాబితాలో ఉమ్మడి జిల్లా నుంచి ఏడింటికి స్థానం దక్కింది. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, వైరా, భద్రాద్రి జిల్లాలో ఇల్లెందు, కొత్తగూడెం, పినపాక ఉన్నాయి. కాగా, ఒక్కో భవనాన్ని 25 ఎకరాల్లో నిర్మించనుండగా వివిధ చోట్ల మంత్రులు కొన్నాళ్ల క్రితమే శంకుస్థాపన చేశారు. ఇప్పుడు నిధులు మంజూరు చేయడంతో పాటు తదుపరి చర్యలు చేపట్టాలని టీజీఈడబ్ల్యూడీసీ(తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)ను ఆదేశించారు. దీంతో భవనాల నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసి త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశముంది. ఇక ఇల్లెందు నియోజకవర్గంలో ఇల్లెందు – కారేపల్లి క్రాస్ మీదుగా మహబూబాబాద్ రోడ్డులో మున్సిపల్ డంప్ యార్డు సమీపాన 25 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించడమే కాక అక్కడ సాగులో ఉన్న పలువురికి నోటీసులు కూడా జారీ చేశారు.

పాత పెన్షన్ విధానంపై సంప్రదింపులు

టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు

ఖమ్మంవ్యవసాయం: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసే అంశంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలు దఫాలుగా సంప్రదింపులు జరిపారని టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు, ఉద్యోగ జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఉమ్మడి జిల్లా మార్కెట్ కమిటీల పెన్షనర్ల కమిటీ అధ్యక్షుడు కనపర్తి బాబు అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం జరగగా ఏలూరి మాట్లాడుతూ.. పెన్షనర్లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా మార్కెట్ కమిటీల్లో పనిచేసే ఉద్యోగులకు కూడా పెన్షన్లు అందే విధంగా కృషి జరుగుతోందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల పెన్షనర్ల రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయిరెడ్డి శంకరలింగం మాట్లాడారు. మార్కెట్ కమిటీ పెన్షనర్ల సమస్యలపై ఎప్పటికప్పుడు టీజీఓ ప్రతినిధులను కలుస్తున్నామని, ఇకనైనా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నామన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు యరగర్ల హన్మంతరావు మాట్లాడుతూ.. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో నిర్మించే నూతన యార్డులో ఓ గదిని పెన్షనర్లకు కేటాయిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్న పెన్షనర్లు, భర్త మరణంతో పెన్షన్లు పొందుతున్న వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుంటుపల్లి శ్రీనివాసరావు, తాడేపల్లి కిరణ్‌కుమార్, పోలవరపు వీరాంజనేయులు, రవికుమార్, జెల్లా వెంకటేశ్వర్లు, దేశబోయిన తిరుపతయ్య, తాళ్లూరి విశ్వనాథం, ఆమంచి కోటయ్య, ఉప్పలయ్య, సుధాకర్ రావు, హుస్సేన్, నాగేశ్వరరావు, ఆంజనేయులు, వెంకయ్య, ఉదయలక్ష్మీ, ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, సారయ్య, సజాద్ అలీ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెస్ విజేతలు వీరే..

ఖమ్మం స్పోర్ట్స్ : జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం నగరంలోని సర్వజ్ఞ స్కూల్‌లో జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. అండర్–10, 13, 16 బాలబాలికల విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో విజేతలకు సబ్ కలెక్టర్ బాలకృష్ణారెడ్డి, పాఠశాల డైరెక్టర్ నాగేంద్రకుమార్, జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి గోపికృష్ణ, షఫీ, జ్యోత్స్న బహుమతులు అందజేశారు. అండర్–10 బాలుర విభాగంలో శివనాగసాయి(పాల్వంచ), కె.అరిహింత్, ఎస్.అరుష్, బాలికల విభాగంలో బి.బ్రిందభావజ్ఞ, జి.కృతప్రీతిక, సీహెచ్.మనస్విని, అండర్–13లో డి.ద్యుమన్, శ్రీహస్, ఎస్.లౌక్య, అండర్–16 విభాగంలో అఖిల్, రణధీర్, హర్షవర్ధన్, కృష్ణ, ఎం.వర్షిత, ఎస్.కీర్తన, లాస్య విజేతలుగా నిలిచారు.

అభివృద్ధిలో ముందుంచుతాం



మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన భట్టి, పొంగులేటి, ఎమ్మెల్యేలు, ఎంపీలు

- అత్యవసర పనులకు మినరల్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఫండ్ వినియోగించుకోండి
- ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొంగులేటి, ఎంపీలు, ఎమ్మెల్యేలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లా సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం వ్యూహాత్మక ప్రణాళికలతో ముందుకుపోతోందని, ఉమ్మడి జిల్లాను అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలుపుతామని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధిపై ఆదివారం ఆయన హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీలు రేణుకాచౌదరి, పోరిక బలరాం నాయక్, రామసహాయం రఘురాంరెడ్డితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు అనుసరించాల్సిన విధానాలపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో తాగు, సాగునీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాలను కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో నంబర్ వన్‌గా నిలబెట్టేందుకు అనుసరించాల్సిన ప్రణాళికలపై విస్తృతంగా చర్చించామన్నారు.

జిల్లాలో అత్యవసర అభివృద్ధి పనులకు మినరల్ ఫండ్, జిల్లా అభివృద్ధి నిధులు, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిధులను వినియోగించుకోవాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. హ్యామ్ రోడ్ల మంజూరులో ఉమ్మడి జిల్లాకు ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. జిల్లాలో పార్టీని మరింత పటిష్టం చేస్తామని అన్నారు. సమావేశంలో పినపాక, భద్రాచలం, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

మనువాదం ప్రజలను పీడిస్తోంది

- ప్రజా పోరాటాల్లో పెద్దన్న రవన్న
- వర్ధంతి సభలో వీపీవీ నేత పట్నాయక్



మాట్లాడుతున్న రమేష్ పట్నాయక్, పక్కన నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్ : దేశంలో మనువాదం, మార్కెట్ భావజాలం అనే కవల పిల్లలు ప్రజలను పీడిస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు సమరశీల పోరాటాలు నిర్వహించాలని విద్యా పరిరక్షణ వేదిక జాతీయ నాయకులు రమేష్ పట్నాయక్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్–రవన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాయల సుభాస్ చంద్రబోస్ (రవన్న) 9వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ.. దేశ సంపదను లూటీ చేసేలా కార్పొరేట్ శక్తులకు పాలకులు సేవ చేస్తున్నారని అన్నారు. పేదలను మరింత బలహీనంగా మారుస్తూ సోమరిపోతులుగా చూస్తున్నారని విమర్శించారు. నిత్యావసరాల ధరలు మండుతున్నాయని, కోట్లాది కుటుంబాలు పేదరికంలో కూరుకుపోతుంటే కార్పొరేట్ వర్గాల వారు శత కోటీశ్వరులుగా మారుతున్నారని అన్నారు. ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, వైద్యం విద్యుత్, సాగు, తాగునీరు, సేవా రంగం, సంక్షేమ పథకాలు ఇవన్నీ ప్రజలకు అందించాల్సిన బాధ్యత పాలకవర్గాలపై ఉందన్నారు. ప్రముఖ సంపాదకులు సతీష్ చందర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రంగాలను పెట్టుబడిదారీ వ్యవస్థ నియంత్రిస్తోందన్నారు. మనువాద చాందస భావాలకు వ్యతిరేకంగా సమష్టిగా ఉద్యమించాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కేజీ రామచందర్ మాట్లాడుతూ రవన్న అతివాద, అవకాశవాదాలకు వ్యతిరేకంగా అంతర్గత పోరాటం చేసి విప్లవోద్యమాన్ని సరైన దిశలో నడిపారని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, నాయకులు కెచ్చల రంగయ్య, గుర్రం అచ్చయ్య, కె.రమ, గోకినపల్లి వెంకటేశ్వర్లు, చంద్ర అరుణ, ముద్ద భిక్షం, పుసులూరి నరేందర్, చిన్న చంద్రన్న, హన్మేశ్, ఎస్ఎల్ పద్మ, ఆవుల వెంకటేశ్వర్లు, సి.వై.పుల్లయ్య జి.రామయ్య, మనోహర్ రాజు, కల్పన, ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

'తాయిలం' అందేనా ?

- ప్రతి ఏటా రామాలయంపైనే ఉత్సవాల భారం
- నిర్వహణ ఖర్చులకు హుండీ ఆదాయమే మార్గం
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు



రామాలయం వ్యూ

భద్రాచలం: భద్రగిరి రామయ్యకు సర్కారు తాయిలం అందడం లేదు. ప్రతీ ఏడాది ఉత్సవాల సమయంలో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నా నిరుత్సాహమే మిగులుతోంది. దేవస్థానంలో జరిగే ప్రధాన ఉత్సవాల నిర్వహణ వ్యయం తలకు మించిన భారం అవుతుండడంతో అధికారులు తల పట్టుకుంటున్నారు. చివరికి భక్తులు సమర్పించే హుండీ ఆదాయమే దిక్కుగా మారడంతో ఆ నిధులనే ఉత్సవాల నిర్వహణకు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఆలయ అభివృద్ధి కుంటుపడుతోందని ఇటు భక్తులు, అటు అధికారులు ఆవేదన చెందుతున్నారు.

నవమి వ్యయం రూ.2 కోట్లకు పైగానే..

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే ఉత్సవాల్లో ముక్కోటి, శ్రీరామనవమి ముఖ్యమైనవి. వీటితో పాటు భక్తరామదాసు జయంతి ఉత్సవాలనూ ఘనంగా నిర్వహిస్తారు. అయితే వీటిలో ముక్కోటి సందర్భంగా తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం, శ్రీరామనవమి వేడుకలకు భక్తులు భారీగా హాజరవుతుంటారు. ఆ సమయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది సైతం వందల సంఖ్యలో ఉంటారు. కాగా, ఈ ఉత్సవాల నిర్వహణకు అధిక మొత్తంలో ఖర్చవుతుంది. వస్తువుల ధరలు, వివిధ విభాగాల కార్మికుల జీతభత్యాలు పెరుగుతుండగా ఏటేటా నిర్వహణ వ్యయం సైతం పెరుగుతోంది. గతంలో రూ. కోటి – కోటిన్నర మధ్యలో ఖర్చు కాగా, ఈ ఏడాది రూ.రెండు కోట్లకు పైగానే అవసరమని అధికారులు అంటున్నారు. వీటిలో ఉత్సవ నిర్వహణ పనులకు రూ.కోటిన్నర, క్రతువు నిర్వహణ, తలంబ్రాలు, పట్టువస్త్రాలు, ఇతర ఖర్చులకు మరో కోటి వరకు ఖర్చవుతుందని అనధికారికంగా చెబుతున్నారు. ముక్కోటికి సైతం రూ.కోటిన్నర వరకు వ్యయం అవుతున్నట్లు అంచనా.

ఖర్చులకు కానుకలే దిక్కు..

భద్రాచలంలో జరిగే శ్రీరామనవమి వేడుకలకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. అయితే ప్రభుత్వం నుంచి అందే సాయం మాత్రం రూ.15వేలు మాత్రమే. అది కూడా పేపర్లపై లెక్కలు చూపడం మాత్రమే. అంతకుమించి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి వచ్చేది లేదు. నవమి వేడుకలకు సాయం అందించాలని అటు అధికారులు, ఇటు భక్తులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నా ఫలితం లేదు. రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతరకు అందించే స్థాయిలో కాకున్నా భక్తుల మనోభావాలను గౌరవించి ఉత్సవాల నిర్వహణకు ఎంతో కొంత అందించాలని పలువురు కోరుతున్నారు. కాగా హుండీల ద్వారా భక్తులు సమర్పించే కానుకలనే ఉత్సవాల నిర్వహణకు వెచ్చిస్తున్నారు. గతం కంటే ఆదాయం పెరిగినా ఆలయ అభివృద్ధికి, భక్తులకు మరింతగా వసతుల కల్పనకు వెచ్చించాల్సిన నిధులను ఉత్సవాల కోసం ఖర్చు చేయాల్సి వస్తోంది. భద్రాచలంలో భక్తులకు వసతి కష్టాలు నిత్యం ఎదురవుతుంటాయి. ఆలయానికి వచ్చే ఆదాయంతో రంగనాయకుల గుట్ట మీద, కింద దేవస్థానం భూముల్లో డార్మెటరీ, 100 గదుల వసతి గృహాలను నిర్మిస్తే ఈ సమస్య తీరే అవకాశం ఉంటుంది.

కాంగ్రెస్ సర్కారైనా..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం దేవస్థానంలో ఉత్సవాల నిర్వహణకు ఒక్క పైసా విదల్చలేదు. ఆలయ అభివృద్ధికి రూ. 100 కోట్లు ఇస్తామన్న హామీని సైతం విస్మరించింది. ఇక ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారైనా నిధులు ఇవ్వకపోతుందా అని భక్తులు కోటి ఆశలు పెట్టుకున్నారు. గతేడాది శ్రీరామనవమి ఉత్సవాలకు నిధులు కేటాయిస్తుందని భావించినా విడుదల చేయలేదు. ఈ ఏడాదైనా రామయ్యపై కరుణ చూపేనా అని భక్తులు, అధికారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. గత ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా సీఎం హోదాలో రేవంత్ రెడ్డి హాజరు కాలేదు. ఈ ఏడాది హాజరు కావడంతో పాటు ఆలయ అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇచ్చే అవకాశం ఉందని పలువురు ఆశిస్తున్నారు.

తక్షణమే సాయం అందించాలి



భక్తుల ఆదాయం భక్తులకే చెందాలి. ఉత్సవాల నిర్వహణ పేరుతో పక్కదారి పట్టించడం సరైంది కాదు. హుండీ ఆదాయాన్ని భక్తుల వసతుల కల్పనకు కేటాయించాలి. ఆలయంలో జరిగే ఉత్సవాల నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం స్వీకరించాలి. వీటికి అయ్యే ప్రతీ పైసా ప్రభుత్వమే భరించాలి.

– బూసిరెడ్డి శంకర్ రెడ్డి, భద్రాద్రి పరిరక్షణ సమితి అధ్యక్షుడు

క్లుప్తంగా

మేడూరు పుణ్యక్షేత్రానికి పాదయాత్ర



మేడూరు పుణ్యక్షేత్రానికి తరలి వెళ్తున్న వాకర్స్

మధిర: పట్టణంలోని బంజారాకాలనీలో ఉన్న శ్రీ లక్ష్మీపద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి కలయిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మేడూరు పుణ్యక్షేత్రానికి పాదయాత్ర చేశారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరులో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయానికి వెళ్తున్న పాదయాత్రను స్థానిక బంజారాకాలనీ వద్ద కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావు ప్రారంభించారు. మేడూరు ఆలయంలో తొలుత వాకర్స్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకుల కోరిక మేరకు ఉగాది పండుగ రోజున పులిహోర ప్రసాదం కోసం 50 కేజీల బియ్యం వితరణ చేశారు. కార్యక్రమంలో మైలవరపు వీరభద్రరావు, దోకుపర్తి సత్యంబాబు, లక్ష్మీనారాయణ, బోణాల నాగేశ్వరరావు, వంగూరి గోపి, శ్రీనివాసరావు, నాళ్ల నారాయణరావు, చిట్యాల శేషు, నాగుబండి వంశీ, మధు, రవి, చల్లా సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

సన్మానం...
రిటైర్డ్ ప్రిన్సిపాల్‌కు..



రామారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన కేఎస్ రామారావు సన్మానసభను నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో 'మనలోని మనిషి'పేరుతో శనివారం నిర్వహించారు. ఇంటర్ విద్య జేఏసీ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్య జేఏసీ చైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్‌రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తదితరులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్‌గా, లెక్చరర్, ప్రిన్సిపాల్స్ సంఘం జిల్లా, రాష్ట్ర, జేఏసీ బాధ్యుడిగా విశేష సేవలందించారని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం కేఎస్ రామారావు దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఐఈఓ రవికుమార్, జేఏసీ నాయకులు కళింగ కృష్ణకుమార్, బలరాం జాదవ్, రవీందర్‌రెడ్డి, ఈ.శ్రీనివాసరెడ్డి, అంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కవయిత్రి యువశ్రీకి అవార్డు



యువశ్రీని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంఅర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక 'ఆమెకు వందనం'అనే కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ రంగాల్లో ప్రతిభ కనపరిచిన మహిళలకు విజయవాడలో నారీరత్న అవార్డులను అందించింది. అందులో భాగంగా నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని యువశ్రీ బీరకు సైతం అవార్డు అందించారు. ఆమెను తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని బారుగూడెం శ్రీసిటీ సమీపంలో కారు ఢీకొని ఇటుక బట్టీ కార్మికుడు శుక్రు కంద (50) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, కలవాడి జిల్లా, దోమర్‌గూడ మండలం, కమ్మండ గ్రామానికి చెందిన కంద కుటుంబంతో మండలంలోని బారుగూడెం వద్ద గల ఇటుక బట్టీలో మూడు నెలలుగా పని చేస్తున్నాడు. ఆదివారం సరుకులు తీసుకురావడానికి శ్రీసిటీ వద్ద గల కిరాణా దుకాణానికి వెళ్లి వస్తుండగా వరంగల్ వైపు నుంచివస్తున్న కారు కందను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన కందను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి...

కల్లూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం కోకిలంపాడు గ్రామానికి చెందిన ఎక్కిరాల సురేశ్ (40) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం రాత్రి 10 గంటల సమయంలో సురేశ్ తన పల్సర్ బైక్‌పై కల్లూరు మండలం బత్తులపల్లి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. కాకతీయ షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సురేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి సోదరుడు రాజేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

'జనరిక్' ఆదరణ అంతంతే..

- అవగాహన లేక వినియోగించని ప్రజలు
- బ్రాండెడ్ మందులే రాస్తున్న వైద్యులు
- చుక్కలనంటే ధరలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేదలు
- జనరిక్‌లో కొనుగోలు ఎంతో మేలు



పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రం

ఖమ్మంవైద్యవిభాగం: ఔషధ దుకాణాల్లో మందుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. ఏ చిన్న మందు గోలి తీసుకున్నా ధరలు మాత్రం భారీగా ఉంటున్నాయి. బ్రాండెడ్ మందుల పేరుతో రోగుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. హోల్‌సెల్‌లో వారికి తక్కువ ధర పలికినా అమ్మే సమయంలో మాత్రం వాటి ధర మూడింతలకు పైగా వేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. అయితే తక్కువ ధరలకు లభించే జనరిక్ మందులు అందుబాటులో ఉన్నా వాటిపై ప్రజల్లో ఆదరణ మాత్రం నామమాత్రంగా ఉంటోంది. ప్రజలకు వాటిపై అవగాహన లేకపోవటంతో ఎక్కువగా బ్రాండెడ్ మందులనే వాడుతున్నారు. అయితే, మందుల దుకాణాల్లో ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. పేద వాడిపై ఔషధ ధరల భారం తగ్గించే జనరిక్ మందుల వినియోగంపై జనం ఆసక్తి చూపించటం లేదు. అవగాహన లేకపోవటం, వైద్యులు బ్రాండెడ్ మందులే రాస్తుండటంతో భారమైనా పెద్ద కంపెనీల మందులే కొనుగోలు చేస్తుండటంతో రోగుల జేబులకు చిల్లులు తప్పట్లేదు. వైద్యులు జనరిక్ పేరు మాత్రమే ప్రిస్కిప్షన్‌లో రాయాలన్న నిబంధన ఉన్నా అమలు కాక జనానికి వారు సూచించిన మందులే కొనాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.

జిల్లాలో 15 దుకాణాలే..

జీవన శైలిలో మార్పు కారణంగా దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. దీర్ఘకాలం ఔషధాలు వినియోగించాల్సి రావడంతో పేదలు, మధ్యతరగతి రోగులు భారం భరించలేకపోతున్నారు. జనరిక్ ఔషధాలతో ఆర్థిక భారం తగ్గించుకునే అవకాశం ఉన్నా అవగాహన ఉండటం లేదు. మరోవైపు జనరిక్ మందుల గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సిన వైద్యులే జనరిక్ మందుల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తుండటంతో ప్రజల్లో ఉన్న అపోహలు తొలగటం లేదు. దీనికి తోడు జిల్లాలో జనరిక్ ఔషధ దుకాణాలు చాలా తక్కువగా ఉన్నాయి. మొత్తం 15 మాత్రమే ఉండటం, అవి కూడా జిల్లా కేంద్రంలో ఉండటం మూలంగా ప్రజలకు వాటిపై అవగాహన ఉండట్లేదు. నాణ్యమైన జనరిక్ ఔషధాలు పేదలకు అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రతీ జిల్లా కేంద్రంలో ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అది ఏర్పాటు చేయగా పెద్దగా ఆదరణ లభించట్లేదని నిర్వాహకులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు జనరిక్ కేంద్రాలపై అవగాహన లేక చాలా మంది ప్రజలు బ్రాండెడ్ మందుల వైపు మొగ్గు చూపిస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్

మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా 2002 కోడ్ ఆఫ్ మెడికల్ ఎథిక్స్ నిబంధన ప్రకారం ప్రతీ వైద్యుడు సాధ్యమైనంత మేరకు జనరిక్ పేర్లతో మందులను సూచించాలి. కానీ, ఈ ఆదేశాల అమలుపై పర్యవేక్షణ లేదు. బ్రాండెడ్ మందులు రాయటం నేరమేమీ కాకపోవటంతో వైద్యులు పట్టించుకోవటం లేదు. ఫార్మా కంపెనీలు తమ మందులను వైద్యుల ద్వారా ప్రచారం చేస్తాయి. దీని కోసం వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తాయి. అయితే జనరిక్ మందులను ప్రోత్సహిస్తే మాత్రం వైద్యులకు ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఫార్మా రంగంలో కఠినమైన పోటీ కారణంగా బ్రాండెడ్ కంపెనీలు మార్కెటింగ్‌పై చాలా ఖర్చు చేస్తుంటాయి. తమ బ్రాండ్ ఔషధాలను సూచించినందుకు వైద్యులకు ప్రోత్సాహకాలు అందిస్తుంటాయి. దీంతో వారు జనరిక్ మందులు రాయడానికి ఆసక్తి చూపడం లేదు. వైద్యుల ప్రిస్కిప్షన్ ప్రకారం ఔషధాలు కొనుగోలు చేసే రోగులు బ్రాండెడ్‌కే అలవాటు పడుతున్నారు. దీనికి తోడు వైద్యులు సూచించిన దుకాణాలు, వారి ఆస్పత్రుల్లోనే మందులు కొనుగోలు చేయాల్సి రావడంతో అక్కడ ఉండే బ్రాండెడ్ ఔషధాలే దిక్కవుతున్నాయి. దీంతో జనరిక్ వైపు వెళ్లే వారు తక్కువ అవుతున్నారు.

ప్రజల్లో అవగాహన రావాలి



జనరిక్ మందులే వాడాలనే నిబంధన ఏమీ లేదు. ప్రజలు వాటి వైపు మొగ్గు చూపిస్తే మాత్రం వారి ఆర్థిక భారం తప్పుతుంది. అది వారు వెళ్లే వైద్యుడిపైనే ఆధారపడి ఉంటుంది. జనరిక్ ఔషధాలపై ప్రజల్లో మరింత అవగాహన రావాల్సి ఉంది. సాధారణ మందుల దుకాణంతో పాటు జనరిక్ మందుల దుకాణ లైసెన్స్ పొందేందుకు ఒకే నిబంధనలు ఉంటాయి. ఉత్పత్తి చేసిన కంపెనీ నుంచి నేరుగా ఔషధ దుకాణాలకు చేరవేస్తారు కాబట్టి ఖర్చులు తగ్గటం వల్లనే జనరిక్ ఔషధాల ధరలు తక్కువగా ఉంటాయి. బ్రాండెడ్ కంపెనీలు మార్కెటింగ్‌కు అధికంగా వెచ్చిస్తాయి కాబట్టి ధరలు అధికంగా ఉంటాయి. ప్రిస్కిప్షన్‌లో జనరిక్ మందులను వైద్యులు సూచిస్తే వినియోగం గణనీయంగా పెరుగుతుంది.

– అనిల్‌కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఖమ్మం

దద్దరిల్లుతున్న బాంబుల మోత

ఆరెంపుల వాసుల ఆందోళన..



జిలెటిన్ స్టిక్స్ అమర్చేందుకు రాళ్లకు డ్రిల్ చేస్తున్న దృశ్యం



బ్లాస్టింగ్‌తో పేల్చిన బండరాళ్లు

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెంపుల శివారు ఇరవై ఎకరాల భూమిలో కొందరు అనుమతి లేకుండా పేలుళ్లకు పాల్పడుతున్నారు. జనావాసాల నడుమ.. రాత్రింబవళ్లు బాంబుల (జిలెటిన్ స్టిక్స్)తో బండలను పేలుస్తుండగా రాళ్లు ఎగిరి పడుతుండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బండరాళ్లను పేల్చడానికి తోడు భూమిని చదును చేసేందుకు ఇప్పటికే వందకు పైగా తాటిచెట్లను నేలమట్టం చేయగా తాము జీవనాధారం కోల్పోతున్నామని గీతకార్మికులు వాపోతున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్, ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంపై స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమంగా బ్లాస్టింగ్ చేసి, తాటిచెట్లను నరికి వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ అంశంపై రూరల్ సీఐ రాజును వివరణ కోరగా.. బ్లాస్టింగ్‌కు సంబంధించి ఎవరూ అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు. ఎవరైనా బ్లాస్టింగ్‌కు పాల్పడినట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యం



దామోదర్‌రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

ఖమ్మంవ్యవసాయం: సేంద్రియ పంటలే ఆరోగ్యకరమని మూలం సంత నిర్వాహకులు గ్రామీణ భారతి, సంయుక్త కిసాన్ మోర్చ ప్రతినిధులు నల్లమల వెంకటేశ్వరరావు, కుతుంబాక మాధవి, అనమోలు రాంరెడ్డి, చెరుకూరి రామారావు, రెట్టచర్ల నాగేశ్వరరావు, కోసూరి ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని వీడీవోస్ కాలనీ సమీకృత మార్కెట్‌లో మూలం సంత నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేయగా నిర్వాహకులు మాట్లాడారు. కొందరు రైతులు సేంద్రియ వ్యవసాయం చేస్తూ ఆరోగ్యాన్నిచ్చే పంటలు పండిస్తున్నా వారికి ఆదరణ దక్కటం లేదని తెలిపారు. ఆయా పంటలు పండించే వారికి మార్కెటింగ్ సౌకర్యం లేకపోవటం దురదృష్టకరమన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా సేంద్రియ పంటల విక్రయానికి రాష్ట్రంలో మూలం సంతల ఏర్పాటు జరుగుతోందని, జిల్లాలో మూలం సంతపై ప్రత్యేక దృష్టిని సారించామని చెప్పారు. ప్రస్తుతం 23 స్టాళ్లను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌కు మందుగా సేంద్రియ పద్ధతిలో పసుపు పండిస్తూ, పంపిణీ చేస్తూ ప్రాచుర్యం పొందుతున్న మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామ రైతు గంటా దామోదర్‌రెడ్డిని సంత నిర్వాహకులు సత్కరించారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారు తనను సంప్రదించవచ్చని(99083 84915) దామోదర్‌రెడ్డి సూచించారు.

రామయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

- పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు
- కొత్తగూడెం కోర్టులో వెయిటింగ్ హాల్ ప్రారంభం



హైకోర్టు న్యాయమూర్తికి ప్రతిమ అందిస్తున్న భద్రాచలం 'బార్' సభ్యులు

భద్రాచలంఅర్బన్/పాల్వంచరూరల్/కొత్తగూడెం టౌన్ : భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా ఆదివారం దర్శించుకున్నారు. ఆమెకు ఈఓ రమాదేవి స్వాగతం పలకగా వైదిక పెద్దలు ఆశీర్వచనం అందజేశారు. ప్రధాన ఆలయంతో పాటు ఆంజనేయస్వామి, లక్ష్మీతయారమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం జస్టిస్ నందా భద్రాచలం జ్యుడీషియల్ కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆ తర్వాత బార్ అసోసియేషన్ సభ్యులు సన్మానించి రాముల వారి ప్రతిమ అందజేశారు. అనంతరం జస్టిస్ నందా పెద్దమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఈఓ రజనీకుమారి జడ్జికి అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

కొత్తగూడెం కోర్టులో..

కొత్తగూడెం కోర్టులో నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను న్యాయమూర్తి సూరేపల్లి నందా ఆదివారం ప్రారంభించారు. ఆమెకు జిల్లా జడ్జి పాటిల్ వసంత్, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నందా మాట్లాడుతూ.. న్యాయ సేవలను అందుబాటులోకి తేవడంలో, లీగల్ ఆవేర్‌నేస్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడంలో న్యాయవాదులు కీలకపాత్ర పోషిస్తున్నారని అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.సాయిశ్రీ, మణుగూరు, దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జీలు కె. సూరిరెడ్డి, బి.భవానీ, ఎస్పీ రోహిత్‌రాజు, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, భద్రాచలం, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం, లక్కినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడి తొలగింపు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థినిని వేధించిన కాంట్రాక్ట్ అధ్యాపకుడు కె.హరిశంకర్‌ను ఉన్నతాధికారులు విధుల నుంచి తొలగించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు ఆదివారం తెలిపారు. అధ్యాపకుడిపై వచ్చిన ఆరోపణలపై విచారణ అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

అదృశ్యమైన వృద్ధురాలు విగతజీవిగా..

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమత ఆస్పత్రి సమీపంలో నివాసం ఉండే మొగిలి సుక్కమ్మ (70) ఈ నెల 4న అదృశ్యమై ఆదివారం విగత జీవిగా లభించింది. ఖమ్మంఅర్బన్ సీఐ భానుప్రకాష్ కథనం ప్రకారం.. సుక్కమ్మ మతిస్థిమితం లేక 4వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు భర్త నాగేశ్వరరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం ఖమ్మంలకారం ట్యాంక్ బండ పక్కన కంపచెట్ల చాటున కుళ్లిన మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా సమాచారం అందిందని, మృతదేహంపై ఉన్న ఆనవాళ్ల ప్రకారం సుక్కమ్మగా గుర్తించడంతోపాటు ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం అన్నం ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తరలించామని సీఐ వివరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయ కమిటీ ఇదే..

పాల్వంచరూరల్ : పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలి సభ్యులుగా 15 మంది పేర్లతో కూడిన జాబితా నాలుగు రోజుల క్రితం ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా ఈఓకు అందింది. ఈ జాబితాలో జమ్ముల రాజశేఖర్, బి.సాంబమూర్తి, బండి చిన్న వెంకటేశ్వర్లు, నూనవత్ సుమన్‌నాయక్, భూక్యా గిరిప్రసాద్, కొమరం స్వర్ణలత, పి. రామయ్య, సంకా వెంకట రామరావు, సందుపట్ల రమ్య, ధర్మరాజుల నాగేశ్వర రావు, చెరుకూరి శేఖర్‌బాబు, ఎస్.సత్యనారాయణ, యర్రంశెట్టి నర్సింహారావుతో పాటు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా అర్చకులు రవికుమార్‌శర్మ ఉన్నారు.

కమిటీపై తర్జన భర్జన..

నాలుగు రోజుల క్రితం ఆలయ ఈఓకు జీఓ 66 ద్వారా వచ్చిన ఈ సర్క్యులర్‌పై అంతర్గతంగా తర్జన భర్జనలు జరుగుతున్నాయి. ఇంతకూ ఈ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారా? మార్పులు, చేర్పులు జరుగుతాయా అనేది చర్చనీయాంశంగా మారింది. స్థానికులకు కమిటీలో అవకాశం ఇవ్వకుండా ఇతర ప్రాంతాల వారిని, పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారిని ట్రస్ట్ సభ్యులుగా ఎలా నియమిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. కాగా, కమిటీ ప్రమాణ స్వీకారంపై ఈఓ రజనీకుమారిని వివరణ కోరగా జాబితా వచ్చిందని, అయితే దేవాదాయ శాఖ కమిషనర్, ఏసీల నుంచి వచ్చే ప్రొసీడింగ్ ఆధారంగా ఖరారు చేస్తామని తెలిపారు.

ఎండిపోయినది



జీవనదిగా పేరు గాంచిన భద్రాచలం గోదావరి ఎండిపోతోంది. మార్చి నెలలోనే ఎండలు మండుతుండటంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఐదు రోజులుగా భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 2.6 అడుగుల వద్ద నిలకడగా ఉంది. మార్చి 1వ తేదీన 3.6 అడుగులు ఉండగా, 2వ తేదీన 0.4 అడుగులు తగ్గి 3.1కి చేరుకుంది. గతేడాది జూలైలో వచ్చిన వరదలు మినహాయించి, గోదావరిలో నీటిమట్టం తక్కువగానే ఉంది. గతేడాది నవంబర్ 7వ తేదీ నుంచి ఇప్పటి వరకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 10 అడుగులు మించి ప్రవహించలేదు. క్రమక్రమంగా తగ్గుతూ 2.6 అడుగులకు చేరిది. – భద్రాచలంఅర్బన్

మున్నేటిలో పడి విద్యార్థి మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడు వద్ద మున్నేటిలో ప్రమాదవశాత్తు పడి విద్యార్థి ఎర్రం మహేశ్ (22) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం మొగళ్లపల్లి గ్రామానికి చెందిన మహేశ్ ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం ఫైనలియర్ చదువుతూ.. గట్టయ్యసెంటర్‌లో స్నేహితులతో కలిసి అద్దెకుంటున్నాడు. కాగా, ఈ నెల 8న స్నేహితులతో కలిసి కాల్వ వద్దకు వెళ్లి అందులో పడి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

కుక్కలు అడ్డురావడంతో బైక్ బోల్తా

నేలకొండపల్లి: కుక్కలు అడ్డురావటంతో బైక్ అదుపుతప్పి కింద పడగా దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని మంగాపురంతండా గ్రామ పంచాయతీకి చెందిన మల్టీపర్పస్ వర్కర్ తేజావత్ నరసింహారావు, ఆయన సతీమణి శారదలు బైక్‌పై వల్లభి నుంచి ఇంటికి వస్తున్నారు. గ్రామంలోకి రాగానే కుక్కలు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి బోల్తాకొట్టింది. గాయపడిన దంపతులను స్థానికులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పాలేరు కాలువలోకి దూసుకెళ్లిన కారు

కూసుమంచి: మండలంలోని పెరికసింగారం వద్ద ఆదివారం ఓ కారు పాలేరు పాత కాల్వలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం సంభవించకపోవటంతో ఊపిరిపీల్చుకున్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలం కృష్ణానగర్‌కు చెందిన ఓ కుటుంబం కారులో కూసుమంచి మండలం మల్లేపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్లో జరిగిన వివాహానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో పెరికసింగారం వద్ద పాలేరు కాల్వ కట్ట పైనుంచి రాజుపేట వెళ్లే క్రమంలో అదుపుతప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. తక్కువగా నీటి ప్రవాహం ఉండటంతో పాటు కాల్వకు లైనింగ్ ఉండటంతో కారు బోల్తా పడకుండా నేరుగా కాలువలోకి వెళ్లి నిలిచిపోవటంతో పెను ప్రమాదం తప్పింది. కారులోని చిన్న పిల్లలు, మహిళలను స్థానికులు బయటకు తీశారు.

9 మందిపై కేసు

ఏన్కూరు: ఏన్కూరు ప్రధాన రహదారిపై యువకుడి మృతదేహంతో రాస్తారోకో చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కల్పించిన 9 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ రఫీ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన మండలంలోని టీఎల్‌పేటకు చెందిన యువకుడు పసుపులేటి కృష్ణ కుటుంబానికి న్యాయం చేయాలంటూ గ్రామస్తులు శనివారం సాయంత్రం ఏన్కూరు ప్రధాన రహదారిపై సుమారు గంటకు పైగా రాస్తారోకో చేశారు. మృతికి కారకుడంటూ టాటాఏస్ వాహన యజమాని ఇంటి ఎదుట ఆందోళన చేసిన నేపథ్యంలో అందుకు ప్రధాన కారకులుగా గుర్తించి 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

కేసు నమోదు

రఘునాథపాలెం: మండలంలోని కొర్రతండా, పంగి డి రోడ్డులో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన 16 హెచ్చరిక, సూచిక బోర్డులను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ వెల్లడించారు.

చెట్టుకు బైక్ ఢీకొని ఒకరి మృతి

టేకులపల్లి: వేగంగా వచ్చిన బైక్ చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా మారిన ఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సురేశ్ కథనం ప్రకారం.. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన జోగా వంశీ (22), పొడుగు ప్రవీణ్ బైక్‌పై టేకులపల్లి మండలంలో శుభకార్యానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో వేగంగా బైక్ నడుపుతూ తుమ్మలచెలక క్రాస్‌రోడ్ సమీపంలో అదుపుతప్పి చెట్టుని ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా.. వంశీ మృతిచెందాడు. ప్రవీణ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కిష్టారంలో అనారోగ్యంతో వ్యక్తి మృతి

సైలోబంకరే కారణమని కుటుంబసభ్యుల ఆరోపణ



బుచ్చిబాబు (ఫైల్)

సత్తుపల్లి: సింగరేణి సైలోబంకర్ కాలుష్యం ప్రాణాలు హరిస్తోందంటూ నెల రోజులుగా కిష్టారం గ్రామస్తులు ఓ వైపు ఆందోళనలు చేస్తుండగా.. ఆదివారం కిష్టారం అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. కాలనీకి చెందిన రామాల బుచ్చిబాబు (39) కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శనివారం రాత్రి శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య రాణి, ఇద్దరు కుమార్తెలున్నారు. కేవలం సింగరేణి సైలో బంకర్ విడుదల చేసే కాలుష్యంతోనే గ్రామంలో వరుస మరణాలు సంభవిస్తున్నాయని కిష్టారం గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబాన్ని సింగరేణి ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో చోరీల నిందితులు

వైరా: వైరా పోలీసుల అదుపులో అంతరాష్ట్ర చోరీల ముఠా సభ్యులు ఉన్నట్లు సమాచారం. వైరాలో గతనెల 12వ తేదీన లీలాసుందరయ్యనగర్‌లో వృద్ధురాలు శీలం వెంకట్రావమ్మ ఇంట్లోకి సర్వే పేరుతో వచ్చి వివరాలు సేకరించినట్లు నటించి కాళ్లు, చేతులు కట్టి బీరువాలో ఉన్న 18 తులాల బంగారం చోరీ చేశారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్ ఆధ్వర్యంలో సీఐ నునావత్ సాగర్ నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. వారు ఖమ్మం, సూర్యాపేట జిల్లా, ఏపీ ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నలుగురు వ్యక్తులు, కారు ఫొటోలను విడుదల చేశారు. తర్వాత ఏపీలోని గుంటూరు జిల్లాలో గాలించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు తమిళనాడుకు చెందిన వారిగా మరో ఇద్దరు ఏపీకి చెందిన వారిగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. వారిపై ఏపీ, కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో హత్య, దోపిడీ, కిడ్నాప్ కేసులు కూడా ఉన్నట్లు సమాచారం.

పేకాటస్థావరంపై దాడి

ఖమ్మంఅర్బన్: నగరంలోని ఎన్నెస్పీ కాల్వ కట్ట శ్రీలక్ష్మీనగర్ సమీపంలోని ఖాళీస్థలంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.17,090 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ భానుప్రకాష్ తెలిపారు.

టైలర్‌పై దాడి

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకలో బెల్ట్‌షాపు పక్కన టైలరింగ్ చేస్తున్న అయోధ్యపై మద్యం మత్తులో ఆరెంపుల వీరబాబు దాడి చేసి గాయపరిచాడు. ఆదివారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.